# చైనాలో నూతన విద్యావిధానం

## ఉత్పాదక శ్రమకు, విద్యకు సమన్వయం

లూ టింగ్.యీ

(పుస్తక పరిజ్ఞానం ఎంత విస్తృతమయినదయినా, అసమగ్రమైనదిగానూ, పాక్షికమైనదిగానూ వుంటుంది. కార్యరంగంలో ఏ మాత్రం అనుభవం లేకుండా విశేషపుస్తక పరిచయం, పరిజ్ఞానం వుండటమే సరిపోదు. పూర్తి పరిణితి పొందిన మానవుడిగా ప్రజలను మలచాలంటే ఉత్పాదక శ్రమతో విద్యను సమన్వయ పరచాల్సిన ప్రాధాన్యత ఎంతో వుంది.

పుస్తకాలు విరివిగా చదవడం ద్వారా "సర్వతోముఖాభివృద్ధి"ని సాధించగలమని బూర్జువా మేధావులు భావించడమేకాక, సర్వజ్ఞులుగా, తయారవుతారని కూడా అభిప్రాయపడ్డారు. ఈ వాదనకు భిన్నంగా సమాజం యొక్క అవసరాలను బట్టి, వారి వారి అభిరుచులను బట్టి క్రమంగా ఒక ఉత్పత్తి శాఖ నుండి మరొక ఉత్పత్తిశాఖకు మారగల సామర్థ్యాన్ని విద్యార్థులకు కల్గించడమే సర్వతోముఖాభివృద్ధికి నిజమయిన అర్థం!

అర్థవలస, అర్థఫ్యూడల్ వ్యవస్థకనుగుణమయిన మన విద్యా విధానం, శారీరక శ్రమపట్ల విద్యార్థులకు ఏవగింపును కల్గిస్తున్నది. మనసుతో పనిచేసేవారు ఇతరులను పాలించుతారని, శారీరక శ్రమ చేసేవారు ఇతరులచే పాలించబడతారనే ఫ్యూడల్ నీతిని భారతపాలక వర్గాలు సామ్రాజ్యవాద సంస్కృతుల భావజాలంతో మేళవించి సరికొత్త రూపాలతో ఈనాటి విద్యావిధానం ద్వారా ప్రచారం చేస్తున్నారు. ఫిన్లాండు వంటి పెట్టుబడిదారీ దేశంలోనూ విద్యార్థుల వ్యక్తిగత అభివృద్ధికి కొన్ని మెరుగైన విధానాలను అమలుచేస్తున్నారు. అయితే మొత్తంగా సమాజాభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగాలంటే ఉత్పాదకశ్రమకు-విద్యకు సమన్వయం సాధించాలి.

ఉత్పాదక శ్రమకు – విద్యకు సమన్వయం ఏ విధంగా వుండాలి? దాని ప్రాధాన్యతను అర్థం చేసుకోవటానికి, ఒక విధానాన్ని రూపొందించుకోవడానికి, చైనా కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ 1958లో విద్యా విషయక సమావేశాన్ని నిర్వహించింది. వాటిలో తుది సమావేశం నిర్ణయాలను ఆధారం చేసుకొని లూటింగ్ యీ వ్రాసిన వ్యాసాన్ని చైనా పార్టీ పత్రిక "రెడ్ ఫ్లాగ్" ప్రచురించింది. ఈ వ్యాసాన్ని అనువదించి 1958 సం॥లోనే 'సందేశం' పత్రిక వెలువరించింది.

– సంపాదకులు)

**మన** దేశంలో ఈ యేడు విద్య అతివేగంగా అభివృద్ధి చెందింది. జూన్ మాసాంతం వరకు ప్రభుత్వ గణాంక సమితి తయారుచేసిన లెక్కల ప్రకారం 1240 కౌంటీలలో (మండలాలు) బాలబాలికలందరికీ నేడు ప్రాథమిక విద్య లభిస్తోంది; 68,000 మాధ్యమిక పాఠశాలలను ప్రజలే స్వయంగా నడుపుకొంటున్నారు. స్థానిక పరిపాలనా సంస్థలచే సుమారు 400 కాలేజీలు కొత్తగా నిర్మింపబడ్డాయి. వయోజన విద్యాకేంద్రాలకు రోజూ 9 కోట్ల మంది హాజరవుతున్నారు. 444 కౌంటీలలో నిరక్షరాస్యత ప్రధానంగా నిర్మూలింప బడింది.

ఈ ఏడాది మొదటినుంచీ మన దేశంలో చదువు బాగా వ్యాప్తి చెందుతూంది. ప్రభుత్వ లెక్కల ప్రకారం జూన్ ఆఖరునాటికి (అదయినా అసమగ్రమే) 1240 కౌంటీలలో ప్రాథమిక పాఠశాల చదువు నిర్బంధమూ, ఉచితమూ చేయబడింది. 68 వేల మాధ్యమిక పాఠశాలల్ని ప్రజలే నడుపు కొంటున్నారు. స్థానిక అధికారులు ఉన్నత విద్యాసంస్థల్ని 400 వరకు ఈ మధ్యనే ప్రారంభించారు. ఏ చదువు అయితేనేం మొత్తం 9 కోట్ల మంది చదువుకుంటున్నారు. 444 కౌంటీలలో నిరక్షరాస్యత నిర్మూలించబడింది. కార్యవిధాన సంస్కరణోద్యమంలో విజయం పొందడమూ, బూర్జువామితవాదులతో పోరాటం సాగించడమూతో వ్యవసాయము, పరిశ్రమలు ఉరుకులు, పరుగుల మీద ముందుకు సాగాయి. ఆ అభివృద్ధి సాంకేతిక, సాంస్కృతిక విప్లవాలను వేగిరించింది. సాంస్కృతిక విప్లవ విజృంభణకు విద్యాభివృద్ధి ఒక మంచి సూచన.

గత సంవత్సరం ఆఖరున ఒకటీ, ఈ సంవత్సరారంభంలో ఒకటీ ప్రభుత్వం రెండు పనులు చేసింది. అవి విద్యాభివృద్ధికి బాగా తోడ్పడ్డాయి. అన్ని పాఠశాలలలోనూ చదువునూ పనినీ జోడించడం అనేది వానిలో ఒకటి.

( చైనాలో మొదటి ఆరేళ్ళ చదువు ప్రాథమిక విద్య అనీ, అక్కడి నుంచి కాలేజీలో చేరేవరకూ మాధ్యమిక విద్య అనీ అంటారు)

మాధ్యమిక వ్యవసాయ పాఠశాలల్ని నెలకొల్పడం రెండోది. చదవుకుంటూ పనిచేయడం అనేది ఉత్పాదక శ్రమను సాధారణ విద్యాబోధనతో జతపరుస్తుంది. ఇదివరకటి విద్యాలయాలు శారీరక శ్రమను నీచంగా చూసేవి. అది ఈ మార్పుతో పోతూంది. దీనితో పాఠశాలల వాతావరణమే మారుతూంది. సామాజిక పరిస్థితులలో కూడా మంచిమార్పు వచ్చింది. మాధ్యమిక వ్యవసాయ పాఠశాలలను ప్రజలే నిర్వహించుకొంటున్నారు. వానిలో సాంకేతిక విద్య(వృత్తి) నేర్పబడుతూంది. దీనిలో కొంతసేపు చదువు చెప్తారు; కొంతసేపు పని నేర్పుతారు. చదువు కొనసాగిస్తూనే వ్యవసాయ నిపుణుల్ని తయారు చెయ్యాలనే ప్రజల కోరికను ఇవి సఫలం చేస్తున్నాయి. వాటిని స్థాపించడం సులభం; ప్రయోజనాన్ని నెరవేర్చగలుగుతాయి. ప్రభుత్వ సహాయం లేకపోయినా అవి విద్యార్థుల కుటుంబ భారాల్ని తగ్గించగలుగుతున్నాయి. అందుచేతనే కాస్త ప్రోత్సాహం ఇచ్చిననాటినుంచీ అవి వెదురుబొళ్ళలాగ దూసుకువస్తున్నాయి. కొద్ది నెలలలోనే వేల సంఖ్యలో పెరిగిపోతున్నాయి. ప్రాథమిక పాఠశాల చదువు ముగించినవాళ్ళకి భవిష్యత్తును

గురించిన చింత తొలగిపోయింది. కనుక ప్రజలే వానిని విశేషసంఖ్యలో స్థాపించు కొంటున్నారు. అనేక రాష్ట్రాలలోనూ, అధినివేశ ప్రాంతాలలోనూ, నగరాలలోనూ ప్రాథమిక విద్య నిర్బంధం, ఉచితం చేయబడింది. ఉత్పత్తి అవసరాల దృష్ట్యా వయోజన విద్య కూడా బాగా వ్యాప్తి చెందింది. నిరక్షరాస్యతా నిర్మూలన కార్యక్రమం బ్రహ్మాండంగా సాగిపోతూంది. తీరిక సమయాలలో చదువుకొనేటందుకు వీలుగా – సాధారణ విద్యాలయాలూ, సాంకేతిక విద్యాలయాలూ అనేక తరహాలవి పెద్ద సంఖ్యలో తల ఎత్తుతున్నాయి. సాంస్కృతిక విప్లవ వెల్లువ పల్లెల నుంచి పట్టణాలకు పాకింది. అక్కడ మరొక రకమైన వెల్లువ బయలుదేరింది. అక్కడ పాఠశాలలే ఫ్యాక్టరీలను స్థాపిస్తున్నాయి; ఫ్యాక్టరీలు పాఠశాలలను స్థాపిస్తున్నాయి.

ఈ విధంగా చదువునూ ఉత్పాదక కృషినీ జోడించడంతో, స్కూళ్ళ పాఠ్యక్రమాన్ని మార్చవలసి వచ్చింది. బోధనా క్రమాన్నీ, ఉపాధ్యాయుల్నీ కూడా మార్చవలసివచ్చింది. మన విద్యా కార్యక్రమం "నూరు పుష్పాలు వికసించినట్లూ" వేయి గుర్రాలు దౌడుతీస్తున్నట్లూవుంది. నిపుణుల, పిడివాదనపరుల ఇనామ్ముగా విద్యాబోధన వుండిపోయే స్థితి పోయింది. కమ్యూనిస్టు పార్టీకి, యావత్తు ప్రజానీకానికీ సంబంధించిన పని అయింది. దేశ పరిస్థితుల కనుగుణంగా సోషలిస్టు విద్యాబోధన సాగుతూంది. ఈ మార్పు కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాననే జరుగుతోంది. విద్యారంగంలో చౌకగా, ఎక్కువ వేగంగా, మంచిఫలితాలను ఆశించలేము" అనీ, "విద్యాగంధం లేనివాడు నిపుణులకు దారి చూపలేడు"– అనీ, "కమ్యూనిస్టు పార్టీ కమిటీలకు విద్యా విషయాలు ఏం తెలుస్తాయి?" – అనీ, చెప్పే మాటలు టుప్పున ఎగిరిపోతున్నాయి.

**ఒక బలీయమైన అస్త్రం**

శ్రామికవర్గ నియంతృత్వం అమల్లో ఉన్న సోషలిస్టు రాజ్యాంగం మనది. మన విద్యావిధానం సోషలిస్టు విద్యావిధానమేగాని బూర్జువా విద్యా విధానం కాదు. కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం లేని సోషలిస్టు విద్యా విధానాన్ని మనం వూహించను కూడా లేము. పాత సమాజాన్ని మార్చి, కొత్త సమాజాన్ని నిర్మించడంలో సోషలిస్టు విద్యావిధానం ఒక బలీయమైన అస్త్రం. దోపిడీ వర్గాలనన్నింటినీ నిర్మూలించడం, అన్ని తరహాల దోపిడీ వ్యవస్థనూ వాటి అవశేషాలనూ రద్దు పరచడమూ, "శక్తికొద్దీ పని, అవసరం కొద్దీ అనుభవము"నిచ్చే కమ్యూనిస్టు సమాజాన్ని నిర్మించడమూ సోషలిస్టు విప్లవం యొక్క, సోషలిస్టు నిర్మాణం యొక్క లక్ష్యం. పట్టణాలకూ, పల్లెలకూ మధ్యవున్న తారతమ్యాన్నీ, శారీరక మానసిక శ్రమల మధ్యనున్న అంతరాన్నీ రద్దుపరచడం వాని గమ్యం. సోషలిస్టు విద్యావిధానం యొక్క గమ్యం కూడా సరిగా యిదే. అటువంటి విద్యావిధానాన్ని శ్రామికవర్గ రాజకీయపార్టీ అయిన కమ్యూనిస్టు పార్టీ మాత్రమే నిర్వహించగలదు; బూర్జువావర్గం నిర్వహించలేదు. విద్యావిధానంలో కనిపిస్తున్న ఈ నూతన రూపం కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం క్రింద మాత్రమే సాధ్యం అవుతుంది.

ఈ మధ్య కొన్ని ఏళ్ళుగా విద్యావిధానం గురించి సుదీర్ఘమైన చర్చలు జరుగుతున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్, జూన్ నెలలలో చైనా కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ విద్యావిషయిక సభలను జరిపింది. వానిలో అనేక సిద్ధాంత, కార్యవిధాన సమస్యలు పరిష్కారం అయినాయి.

**"సర్వతోముఖాభివృద్ధి" అంటే ఏమిటి?**

"సర్వతోముఖాభివృద్ధి అంటే ఏమిటి?" అనే సమస్య మీదనే ఈ మధ్య జరుగుతున్న చర్చలన్నీ కేంద్రీకృతమై వున్నాయని చెప్పవచ్చును. మార్క్సిస్టులు "పూర్తి పరిణతి పొందిన మానవుణ్ణి మలచగలము" అని విశ్వసిస్తారు. దానిని విద్య ద్వారానే సాధించ పూనుకొంటారు. మన విద్యావేత్తలు సర్వతో ముఖాభివృద్ధి రావాలంటూంటారు. అదొక విధంగా మంచిదే. కాని "సర్వతోముఖాభివృద్ధి" అంటే ఏమిటో నిర్వచించడంలో వైవిధ్యం వుంది. గడచిన తొమ్మిదేళ్ళలోనూ మన దేశంలో సాగిన విద్యావిధానాన్ని పరిశీలిస్తే బూర్జువా పండితులు సర్వతోముఖాభివృద్ధిని ముఖాముఖిగా, ప్రత్యక్షంగా వ్యతిరేకించడం లేదని కనిపిస్తుంది. పైగా ఆ "సూత్రాన్ని గట్టిగా బలపరుస్తారు" కూడా. ఐతే దానికి పాక్షిక నిర్వచనం ఇస్తారు. సర్వతోముఖాభివృద్ధి పుస్తకాలు విశేషంగా చదివితే కలుగుతుందని చెప్తారు. ఒక వేపున ఉత్పాదక కృషి చేస్తూనే రాజకీయాలను అధ్యయనం చేస్తున్నవారితో వారు ప్రసక్తి పెట్టుకోరు. నిజం చెప్పాలంటే సర్వతోముఖాభివృద్ధి అనే భావానికి కువ్యాఖ్యచేసి "సర్వజ్ఞుల్ని" తయారు చేయడమేనని చెప్తున్నారు.

"సర్వతోముఖాభివృద్ధి" అనే దానికి కమ్యూనిస్టులు చెప్పే అర్థం వేరు; దాని సారాంశం వేరు. విద్యార్థులకు సాధ్యమైనంత ఎక్కువ విస్తృతమైన పరిజ్ఞానం కలిగించాలి. "సమాజం యొక్క అవసరాల్నిబట్టీ, వారి వారి అభిరుచుల్నిబట్టీ వరసగా ఒక ఉత్పత్తి శాఖ నుంచి మరో ఉత్పత్తి శాఖకు మారగల "సర్వతోముఖ సామర్థ్యం" ప్రజలకు కలుగజేయాలనేది దాని అర్థం. పారిశ్రామికోత్పత్తి రంగములో కార్మికులకు, వ్యవసాయోత్పత్తి రంగంలో కర్షకులకు సర్వతోముఖ సామర్థ్యం వుండా లంటాము. సాధారణ పౌరులు సైనిక బాధ్యతలను నిర్వహించగలగాలనీ, రిటైర్ అయిన సైనికులు ఉత్పత్తి రంగంలోకి పోగలగాలనీ మనం అంటున్నాం. ప్రభుత్వోద్యోగాలలో వున్నవారు శరీర శ్రమలోనూ, ఉత్పాదక కృషి చేస్తున్న వారు పరిపాలనా నిర్వహణలోనూ పాల్గొనగలగాలంటాము. ఇవన్నీ ఇప్పటికే క్రమంగా కార్యరూపంలోకి తేబడు తున్నాయి. పని విభజనకూ పని మార్పునకూ సంబంధించిన ఈ చర్యలు ఈనాటి సమాజ అవసరాలకు అనుగుణంగా వున్నాయి. పెట్టుబడిదారీ విధానం క్రింద అమలు జరుగుతున్న పని విభజన కన్న ఇది ఎంతో మంచిదీ, వీలయినదీను. దీనివలన ఉత్పత్తి పెరుగుతుంది. సామాజికంగా ఉత్పత్తి శక్తులలో సర్దుబాట్లు అవసరం అయినప్పుడు గందరగోళం ఏమీ లేకుండా మార్చివేయడం సులభం అవుతుంది.

పరిశ్రమలలోనూ, వ్యవసాయంలోనూ అభివృద్ధి విపరీతంగా జరిగింది. ప్రజల గరిష్టా వసరాలకు పోను ఇంకా మిగిలేటంతగా ఉత్పత్తి జరగడం ప్రారంభమయిందంటే పనివారిని కొత్త కొత్తశాఖలకు మార్చవలసిన అవసరం ఏర్పడుతుంది. ఆ సమస్య ఇప్పటికే తల ఎత్తుతూంది. అలా మార్చలేకపోతే ప్రజల కోరికల్ని మనం తీర్చలేము. ఉత్పాదక శక్తుల్ని ఏకబిగిని వృద్ధిచేస్తూ, ప్రజల

జీవనస్థాయిని కూడ నిరంతరం అభివృద్ధి పరచడం సాధ్యం కాదు. అటువంటి మార్పులకు కావలసిన పూర్వ రంగాన్ని మన విద్యావిధానం మొదలయినవి చక్కబరచాలి. విద్యావిధానం విద్యార్థులలో విస్తృత పరిజ్ఞానం కలిగించేలా వుండాలి. అయితే ఆ విస్తృతి యొక్క పరిమితులు మాత్రం అక్కడున్న పరిస్థితుల మీద ఆధారపడి వుంటాయి. భౌతిక పరిస్థితులూ, మనుష్యుల పరిజ్ఞానం దాని నెక్కడికక్కడ పరిమితం చేస్తుంటాయి. భవిష్యత్తులో కమ్యూనిస్టు సమాజం స్థిరత్వం పొంది, బాగా అభివృద్ధి పొంది పరిణితం అయినప్పుడు మనుష్యులకనేక పనులలో శిక్షణ నిస్తారు. మనుష్యుడు కొన్ని ప్రత్యేక విషయాలలో నిపుణత సాధించినా అనేక వృత్తులను నిర్వహించ గల సామర్థ్యం సంపాదిస్తాడు. ఇది మన గమ్యం. ఈ గమ్యాన్ని సాధించేటందుకు మనం పురోగమించాలి.

**పుస్తక జ్ఞానం చాలదు**

మన దేశంలో ఈవేళ ఉన్న పరిస్థితులలో మనుష్యుడు అనేక విధాలయిన పనులు చేయగలిగేటట్లు అతన్ని తర్ఫీదు చేయగలం. కాని, "ఏ వృత్తినైనా నిర్వహించగలవారిని" యింకా తయారు చేయలేము. విద్యార్థులకిచ్చే జ్ఞానం పాక్షికంగానూ, అల్పాల్పంగానూ గాక సాధ్యమైనంత వరకు పూర్తిగా ఉండాలనేదే సర్వతోముఖాభివృద్ధి అనేదాని వుద్దేశం. అంటే విద్య రాజకీయాలకు సహాయకారీ కావాలి; ఉత్పాదక కృషితో సంబంధం కలదీ కావాలి. కారల్‌మార్క్స్ భవిష్యత్తులో విద్యావిధానం ఎలా వుండాలనుకొన్నాడో వివరిస్తూ ఇలా అన్నాడు:

"ఒక వయస్సు దాటిన ప్రతి పిల్లవానికీ చదువుతో పాటు ఉత్పాదక కృషినీ, వ్యాయమాన్నీ జోడించి నేర్పాలి. అలా చేయడం ఉత్పత్తిలో నేర్పు సంపాదించడానికి మాత్రమే కాదు; సమగ్ర పరిణతి పొందిన మానవుణ్ణి తయారు చేసేటందుకు అదొక్కటే మార్గం."

– (కాపిటల్; సంపుటం.1)

విద్యార్థులు పూర్తి పరిజ్ఞానాన్ని సంపాదించాలనీ, మానసిక శ్రమనేగాక శారీరక శ్రమ కూడా చేయడానికి సమర్థుడయి వుండాలనీ ఆయన విద్యార్థులకు సలహా ఇచ్చారు. పుస్తక పరిజ్ఞానం ఎంత విస్తృతమైనదైనా అసమగ్రమూ, పాక్షికమూ గానే వుంటుంది. కార్యరంగంలో అనుభవం ఏమాత్రం లేకుండా విశేష పుస్తక పరిచయం గలవారినే బూర్జువా సమాజం "సర్వజ్ఞులు" అంటుంది. అయితే వారు మనకొంటున్న విధంగా సర్వతోముఖాభివృద్ధి పొందినవారు కాజాలరు. బాల్యంలో శరీరదారుఢ్యం కలిగించడం అవసరం. అలా కలిగించాలి. దానికి తోడు చిన్నతనంలోనే కమ్యూనిస్టు భావాలు, పని పద్ధతులు, సమిష్టి కృషి పెంపొందించాలి. ఈనాటి మన నైతిక విద్య అంటే ఇదే. ఈ రెండూ మేధో వికాసంతో ముడిపడి వున్నాయి. ఈ రెండూ శారీరక శ్రమతో సంబంధం వున్నవే. కనుకనే విద్యార్జననూ, శ్రమనూ జోడించాలనే సూత్రం తప్పనిసరిగా కార్యరూపంలో పెట్టవలసి వుంటుంది.

మనం చెప్పే సర్వతోముఖాభివృద్ధి అంటే సూక్ష్మంలో ఇది: సాధ్యమైనంత పరిపూర్ణమూ, విస్తృతమూ అయిన పరిజ్ఞానాన్ని విద్యార్థులకు కలిగించాలి. శారీరకంగా ధృఢగాత్రుల్ని చేయాలి. కమ్యూనిస్టు నైతిక నియమాలను అలవరచాలి. "ప్రజల మధ్య వైరుధ్యాలను సక్రమంగా పరిష్కరించేదెలా?" అనే పుస్తకంలో కామ్రేడ్ మావో సే-టుంగ్ ఇలా అన్నాడు :

"చదువుకొనే ప్రతి ఒక్కరూ నైతికంగా, మానసికంగా, శారీరకంగా అభివృద్ధిపొంది సంస్కారంగల, సోషలిస్టు మనస్తత్వంగల కార్మికుడు కాగలిగేలా మన విద్యావిధానం వుండాలి."

సర్వతోముఖాభివృద్ధినివ్వగల విద్యావిధానం అంటే మన వుద్దేశం అది. రాజకీయ చైతన్యం కలిగి, విద్యావంతుడైన వ్యక్తియే "సంస్కారం గల సోషలిస్టు మనస్తత్వం వున్న కార్మికుడు." అతడు మానసిక, శారీరక శ్రమలు రెండూ చేయగలుగుతాడు. సర్వతోముఖంగా, అంటే రాజకీయంగానూ, వృత్తిరీత్యానూ కూడ అర్హత సంపాదించినవాడు అతడే. అతడు కార్మికుడైన మేధావి; మేధావియైన కార్మికుడు.

**విజ్ఞానం ప్రజల సొత్తు**

సర్వతోముఖాభివృద్ధి అనేది విద్యా సూత్రంగా వుండాలని మనం అంటాము. శ్రామికవర్గ రాజకీయాలకు ఉపయుక్తం అయ్యేలాగ విద్యను ఉత్పాదక కృషితో జోడించడమే మానవుని సర్వతోముఖాభివృద్ధికి మార్గమని అంటాము. మరో పద్ధతి లేదు. దీనిని బూర్జువా పండితులు అంగీకరించరు. పుస్తకాలు చదివించి, కంఠోపాఠం చేయిస్తే మనుష్యుడు సర్వతోముఖాభివృద్ధి పొందేలాగ శిక్షణ నివ్వవచ్చునంటారు వారు. విద్యాభివృద్ధికి నిపుణుల మీద ఆధారపడాలంటారు. ప్రజల్ని నమ్ముకొని ప్రయోజనం లేదంటారు. విద్యార్థులు రాజకీయాలు నేర్చుకోవడం, ముఖ్యంగా కార్మికులు కావడం వాళ్ళకి సుతరామూ అంగీకారం కాదు. కాని మనం సర్వతోముఖాభివృద్ధికి ప్రజల మీద ఆధారపడాలంటాము. వారే విద్యా విధానాన్ని నిర్వహించాలంటాము. సర్వతోముఖాభివృద్ధి రావాలంటే కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన విద్య నిర్వహించబడాలంటాము. బూర్జువా విద్యాసూత్రాల ప్రకారం సర్వతోముఖాభివృద్ధి నివ్వగల విద్యను సుశిక్షితులే నిర్వహించగలరంటారు వారు. కమ్యూనిస్టు పార్టీకి 'ఏమీ తెలియదు' కనుక, దాని నాయకత్వం వద్దంటారు. దీనిని పట్టి చూస్తే ఒకటి తెలుస్తుంది. సర్వతోముఖాభివృద్ధి అనే దానికి నిర్వచనాలు బహువిధాలు. దానికి ఫలితాలూను. అవి భిన్నంగానే కాదు, విరుద్ధంగా కూడా వుంటాయి. అందుచేతనే మనం ఈ మధ్య 'సర్వతోముఖాభివృద్ధి' అంటే ఏమిటనే దానిని గురించే బాగా చర్చలు జరిగాయన్నాము. విద్య విషయంలో శ్రామిక వర్గానికీ, బూర్జువా వర్గానికీ గల అభిప్రాయభేదాలు సంఘర్షించాయి.

విజ్ఞానం అనేదానికీ, విద్య ప్రజ్ఞలు తీసుకో వలసిన సమస్య అనేదానికీ, అది కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం క్రింద నిర్వహించబడాలనే దానికీ, సర్వతోముఖాభివృద్ధి అనే దానికీ బూర్జువా పండితులు చేసే వ్యాఖ్యానాన్నే మనమూ అనుసరిస్తే మన విద్యా విషయిక కార్యక్రమం తిరిగి బూర్జువా పంథాకే తిరోగమిస్తుంది. అందుచేత వీటికి కమ్యూనిస్టులం ఇచ్చే నిర్వచనం ఏమిటో స్పష్టపరచడం చాలా ముఖ్యం.

చైనా ప్రజా ప్రభుత్వం ఏర్పడిన యీ తొమ్మిదేళ్ళలోనూ కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన మన విద్యారంగంలో ఎంతో పని జరిగింది. గతంలో విద్యారంగాన్ని నిర్వహించుకొనే హక్కు సామ్రాజ్యవాదులు మనకు లేకుండా చేశారు. దానిని మరల మన చేతులలోకి తెచ్చుకొన్నాము. దేశం అంతటా వున్న స్కూళ్ళన్నింటినీ సంతృప్తికరంగా మన చేతుల్లోకి తీసుకొన్నాము. కొమింటాంగ్ ముఠా స్కూళ్ళ నిర్వహణలో అనుసరించిన ఫాసిస్టు పద్ధతులను రద్దుపరచాము. వారు ప్రవేశపెట్టిన ఫాసిస్టు విద్యావిధానాన్నీ, విద్యార్థులమీద నిఘా పెట్టే పద్ధతినీ రద్దుపరచాము; సోషలిస్టు విద్యావిధానాన్ని ప్రవేశపెట్టాము; విద్యాశాఖలో అణగిమణిగి వున్న విప్లవ వ్యతిరేకుల్నీ, తదితరుల్నీ నిర్మూలించాము. వీటికి తోడు పాఠశాలలో మార్క్సిజం-లెనినిజం తరగతులు ప్రారంభించాము. ఉపాధ్యాయులకూ, విద్యార్థులకు సిద్ధాంత విషయాలలో నూతన పరిజ్ఞానం కలిగించాము; విశ్వవిద్యాలయాలూ, విద్యాశాఖలూ సంస్కరించబడ్డాయి. నూతన బోధనా పద్ధతులు ప్రవేశపెట్టబడినాయి. బూర్జువా మిత వాదులతో పోరాటాలు సాగాయి. కళాశాలలలో, మాధ్యమిక, ప్రాథమిక పాఠశాలలలో విద్యార్థుల సంఖ్య ఎన్నో రెట్లు పెరిగింది. అవిద్యా నిర్మూలన ఉద్యమమూ, తీరిక సమయాలలో సాంస్కృతిక, సాంకేతిక విద్య నేర్చుకొనే కార్యక్రమమూ ఎన్నోరెట్లు ఎక్కువయింది; చదువుకొంటూ పనిచేయడం అనే పద్ధతి పాఠశాలలన్నింటా ప్రవేశపెట్టబడింది; విద్యారంగంలోని కార్యకర్తలలో కమ్యూనిస్టు పార్టీ శాఖలు స్థాపించబడినాయి; సోషలిస్టు నిర్మాణంలో పాల్గొనేటందుకై ఎందరెందరో ప్రజలు కార్యకర్తలుగా శిక్షణ పొందారు.

అయినా ఈ విద్యారంగంలో శ్రామికవర్గ భావాలకూ, బూర్జువావర్గ భావాలకూ మధ్య సంఘర్షణ నిర్విరామంగా సాగుతూనే వుంది. సోషలిస్టు, పెట్టుబడిదారీ పంథాలలో దేనినను సరించడం అనే రూపంలో ఈ సంఘర్షణ సాగుతోంది. బూర్జువా ఆలోచనా ధోరణి విద్యాభివృద్ధికి ఆటంకమయింది. బూర్జువా మితవాదులు సాగించిన తీవ్ర పోరాటాలలో వారు విద్యార్థుల నుపయోగించుకొని పెట్టుబడిదారీ విధానాన్ని పునఃస్థాపించేటందుకు ప్రయత్నించారు. చాంగ్ పో -చున్, లో లుంగ్-చీ, త్సెంగ్ చాఓ-లున్ మొదలయినవారు ఇలాగే ఒకప్పుడు కలలు కన్నారు. మితవాదుల తోటి పోరాటంలో మనం విజయం పొందాము. పరిశ్రమలలోనూ, వ్యవసాయంలోనూ ఎంతో పురోగమించాము. దానితో పరిస్థితులు కాస్త దారినపడ్డాయి. విద్యారంగంలో బూర్జువా ఆలోచనా విధానం ఎంత ప్రమాదకరమో, ఎంత నష్టభరితమో అందరికీ తెలిసివచ్చింది. గడిచిన తొమ్మిదేళ్లలో మనకెంతో అనుభవం కలిగించింది. విద్యారంగంలో పార్టీ అనుసరించే విధానాన్ని ఒక క్రమపద్ధతిలో వివరంగా చెప్పగలశక్తి ఏర్పడింది.

## విద్యతో ఉత్పాదక శ్రమ జోడింపు

విద్యకు ఉత్పాదక శ్రమతో సంబంధం లేకుండా వుండడమే విద్యారంగంలో మనం చేసిన తప్పూ, పొరపాటూను. 1934లోనే మన పార్టీ విద్యనూ, ఉత్పాదక శ్రమనూ జోడించాలనే ప్రతిపాదన ముందుకు తెచ్చింది. మావో సేటుంగ్ ఆనాడే ఇలా అన్నారు :"సోవియట్ సంస్కృతి, విద్యా విషయాలలో మనం సర్వసాధారణంగా అనుసరించవలసిన విధానం ఏమిటి? శ్రమజీవులైన ప్రజా సామాన్యానికి కమ్యూనిజం ఒంటపట్టించాలి; విప్లవ పోరాటానికి, వర్గపోరాటానికి సంస్కృతీ, విద్యా తోడ్పడేటట్లు చేయాలి; విద్యను ఉత్పాదక శ్రమతో జోడించాలి; చైనా ప్రజానీకం నాగరికతనూ, సుఖాన్నీ అనుభవించేటట్లు చేయాలి."

1954 నాటికి ఆర్థిక పునర్నిర్మాణ కార్యక్రమం పూర్తి అయింది. మొదటి పంచవర్ష ప్రణాళిక అమలు జరగడం ప్రారంభమయింది. అప్పుడు స్కూళ్ళలోని పాఠ్య విషయాలలో ఉత్పాదక శ్రమను కూడా జోడించాలని కమ్యూనిస్టు పార్టీ కేంద్రకమిటీ ప్రతిపాదించింది. కాని, దానికెంతో ప్రతిఘటన వచ్చింది. అది ఆనాడు అమలు జరగలేదు. 1957 మార్చిలో ప్రచార పద్ధతులను గురించి అఖిల చైనా మహాసభ జరిగినప్పుడు దాంట్లోనూ, 1957లోనే ఏప్రిల్ 8న రెన్మిక్ రిబావో (పీపుల్స్ డైలీ) సంపాదకీయంలోనూ, 1958 జనవరిలో జరిగిన నానింగ్ సమావేశంలోనూ కేంద్రకమిటీ ఉత్పాదక శ్రమతో విద్యను జోడించాలంటూ మళ్ళీ మళ్ళీ ప్రతిపాదిస్తూ వచ్చింది. పార్టీ చెప్పిన ఈ విధానాన్ని దేశం అంతా గుర్తించినది ఇప్పుడే. విద్యా విధానం రాజకీయాలకు తోడ్పడాలి. దాన్ని ఉత్పాదక శ్రమతో జోడించాలి. దానికి కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం వహించాలి - ఈ మూడింటికి అన్యోన్య సంబంధం వుంది. ఉత్పాదక శ్రమతో సంబంధం వుండని విద్యవల్ల కొంతవరకు రాజకీయాల యెడ అశ్రద్ధ ఏర్పడుతుంది. విద్యారంగంలో పార్టీ నాయకత్వం కొంతవరకు కొరవడుతుంది. ఆ విధంగా మన దేశ పరిస్థితులకూ విద్యా విధానానికి సంబంధం వుండదు. చివరకు మితవాద, పిడివాద పొరపాట్లకు మార్గం ఏర్పడుతుంది.

మన దేశంలో సాగుతున్న సోషలిస్టు విప్లవానికీ, సోషలిస్టు పునర్నిర్మాణానికీ, కమ్యూనిస్టు సమాజాన్ని నిర్మించాలన్న మహదాశయ సిద్ధికీ, విద్యను వేగంగాను, ఎక్కువగాను, మంచిగాను, లాభసాటి ఫలితాలు వుండేటట్లుగాను వృద్ధి పొందించడానికీ ఈ విధంగా విద్యనూ ఉత్పాదక శ్రమను జోడించడం అవసరం.

## సాంస్కృతిక విప్లవం

మన సోషలిస్టు విప్లవం యొక్క గమ్యం దోపిడీ వర్గాలను, దోపిడీ పద్ధతులను, తదవశేషాలను నిర్మూలించడం.సోషలిస్టు విప్లవానికి ఆర్థికరంగంలో ముఖ్యాతిముఖ్యమైన విజయం లభించింది. రాజకీయ, సిద్ధాంత రంగాలలో కూడా పార్టీ ప్రధాన విజయాలను సాధించింది. చైనా కమ్యూనిస్టు పార్టీ ఎనిమిదవ జాతీయ మహాసభ రెండో సమావేశంలో తీర్మానించినట్లు "ఆర్థిక, రాజకీయ, సిద్ధాంత రంగాలలో సోషలిస్టు విప్లవాన్ని కొనసాగిస్తూనే సాంకేతిక, సాంస్కృతిక విప్లవాలను తీవరించడం" ఈనాటి మన కర్తవ్యం.

కేవలం అసమర్థులుగా వున్నవాళ్ళు తప్ప చైనాలోని 60 కోట్ల మంది ఉత్పత్తిలో పాల్గొనేటట్లూ, చదవుకొనేటట్లూ చేయడమే సాంస్కృతిక విప్లవం యొక్క ఉద్దేశం. అంటే రైతుల్నీ, కార్మికుల్నీ, మేధావులుగానూ, మేధావుల్ని కార్మికులిగానూ చేయదలచామన్నమాట. కార్మికులు, కర్షకులు, మేధావులు కూడా ఏకమొత్తంగా తమకు చేతగాని పనిని నేర్చుకొన్నప్పుడే ప్రాచీన సమాజం మనకిచ్చిపోయిన

అవకతవకల్ని సర్దుకోగలు గుతాము. ప్రతి వ్యక్తీ తనలో వున్న లోటును భర్తీ చేసుకుంటాడు. కార్మిక కర్షక ప్రజాసామాన్యం తమలో వున్న సంస్కారశూన్యతను సవరించు కుంటారు. మేధావులు తమలోని బూర్జువా ఆలోచనా ధోరణులను నిర్మూలించుకొంటారు. అందుచేత ఈ విప్లవం యొక్క ఫలితాలు చాలా విస్తృతంగా వుంటాయి. విద్య శ్రామికవర్గ రాజకీయాలకు తోడ్పడేటట్లూ, ఉత్పాదక శ్రమతో జోడింపబడేటట్లూ చేస్తుంది.

మార్క్సు ఒక చోట ఇలా అన్నారు :

"వేగంగా విద్యను ఉత్పాదక శ్రమతో జోడిస్తే అది ఈనాటి సమాజాన్ని మార్చడంలో బాగా ఉపకరిస్తుంది."

(కారల్ మార్క్స్ 'గోథా కార్యక్రమ విమర్శ'లో)

విద్యను ఉత్పాదకశ్రమతో జోడించనిదే సాంస్కృతిక విప్లవాన్ని విజయవంతంగా కొనసాగించలేము. సాంస్కృతిక విప్లవం దేశానికి లాభకరం. కార్మికులకు, కర్షకులకు, మేధావులకూ కూడ లాభకరం. బూర్జువా దృక్పథాన్ని పరిత్యజించ లేనివారు మాత్రమే అటువంటి విప్లవాన్ని వ్యతిరేకిస్తారు. ఏ విధమైన మానసిక శ్రమతోగాని, శారీరక శ్రమతోగాని సంబంధం లేకుండా కేవలం చదువు కోసమే చదువు అనే బూర్జువా దృక్పథానికీ, సోషలిస్టు విప్లవానికీ జతకలవదు.

సోషలిస్టు నిర్మాణాన్ని కొనసాగించేటందుకై మనం చాలా కష్టపడాలి. ఒక్క అడుగు నిలబడ్డానికి వీలులేదు. ఎంతో శ్రమపడి, తక్కువ ఖర్చుతో దేశాన్ని నిర్మించాలి. దానికి సాంకేతిక ప్రావీణ్యం వుండాలి. సాంస్కృతికాభివృద్ధి కావాలి. సోషలిస్టు భావాలున్న వారిని పనులకు అసంఖ్యాకంగా తయారు చెయ్యాలి. సాంకేతిక శాస్త్రంలో వారికి ప్రావీణ్యం వుండాలి. చౌకగా, వేగంగా, ఎక్కువగా మంచి ఫలితాలను సాధించాలనే పట్టుదలతో వారు పని చెయ్యాలి. అందుచేత సోషలిస్టు నిర్మాణాన్ని కొనసాగించాలంటే విద్యనూ, ఉత్పాదక శ్రమనూ జోడించాలి. దీనిని గురించి లెనిన్ ఇలా అన్నారు:

"మన యువకులకు ఉత్పాదక శ్రమతో పాటు విద్యనూ, శిక్షణనూ కలిపి ఇవ్వకపోతే భావి ఆదర్శ సమాజాన్ని వూహించడం కూడా కష్టం. శిక్షణకూ, విద్యకూ ఉత్పాదక శ్రమతో జత కలపకపోయినా ఉత్పాదక శ్రమకు విద్యతోనూ, శిక్షణతోనూ జత కలపకపోయినా ఈనాటి సాంకేతిక నైపుణ్యాన్ని సాధించలేము. విజ్ఞాన శాస్త్ర స్థాయిని అందుకోలేము."

(నరోద్నిక్కుల మతిభ్రష్టు ప్రణాళికలలోని ఆణిముత్యాలు)

విద్యనూ ఉత్పాదక శ్రమనూ జత కలిపితే తప్పకుండా విద్యయొక్క స్థాయి పెరుగుతుంది. మేధోవికాసానికి, నైతిక శారీరకాభివృద్ధికీ కూడ అది అవసరమే. మానసిక, శారీరక శ్రమల్ని వేరుపరచే విద్యావిధానం సోషలిస్టు నిర్మాణావసరాల్ని తీర్చలేదు.

**కమ్యూనిస్టు సమాజ బీజం**

భావి కమ్యూనిస్టు సమాజంలో "శక్తి కొద్దీ పని, అవసరం కొద్దీ అనుభవం" వుంటుంది. ఆ సమాజంలో పట్టణానికీ – పల్లెకూ, మానసిక శ్రమకూ, శారీరక శ్రమకూ మధ్యనున్న విభేదాలు రద్దయిపోతాయి. పారిశ్రామికంగానూ, వ్యావసాయి కంగానూ మనం సాధించిన విజయాలు, "కమ్యూనిజం ఏనాటి మాటో" అనే అభిప్రాయాన్ని తొలగించాయి. నూటపదేళ్ళక్రితం మార్క్సు, ఏంగెల్సులు కమ్యూనిస్టు సమాజాన్ని స్థాపించే టందుకు పదిపనులు జరగవలసి వుందని, కమ్యూనిస్టు ప్రణాళికలో పేర్కొన్నారు. "బాగా అభివృద్ధిపొందిన దేశాలలో... వానిని సర్వ సామాన్యంగా ప్రవేశపెట్టవచ్చును" అని వారు అన్నారు. వానిలో మొదటి ఎనిమిందిటినీ చైనాలో ఇప్పటికే ప్రవేశపెట్టాము. మన దేశంలో వున్న నిజ పరిస్థితులకు అనుగుణమైన విధంగా వానిని సర్దుబాటు చేసి తీసుకువచ్చాము. ఇంక చివరివి రెండూ మిగిలాయి: ఒకటి "వ్యవసాయాన్ని వస్తూత్పాదక పరిశ్రమలలో జోడించడమూ, క్రమంగా పల్లెలకూ పట్టణాలకూ మధ్యనుండే భేదాన్ని అంతరింపచేయటమూ". రెండోది "విద్యను పారిశ్రామికోత్పత్తితో జోడించడము." ఈ రెండింటినీ ఇప్పుడే ప్రారంభిస్తున్నాం.

పారిశ్రామికాభివృద్ధికై ప్రభుత్వం దిగువ విధానాల నవలంబించింది : "భారీ పరిశ్రమకు ప్రాధాన్యం ఇస్తూనే పరిశ్రమలనూ, వ్యవసాయాన్నీ ఏకకాలంలో వృద్ధిపరచ పూనుకోవాలి. కేంద్రీకృత నాయకత్వం, సమగ్ర ప్రణాళిక, సక్రమమైన పని విభజన, సహకారమూ ద్వారా జాతీయ స్థానిక పరిశ్రమలనూ, చిన్న పెద్ద మధ్యతరగతి పరిశ్రమలనూ ఏకకాలంలో వృద్ధిపరచ పూనుకొనాలి." ఈ విధానాన్ని అనుసరించడం వలన గ్రామ సీమలలో పరిశ్రమలు తలఎత్త నారంబించాయి. దానితో పాటుగానే శ్రామికులైన రైతులూ, రైతులైన శ్రామికులూ తయారయ్యారు. ఇది కూడా కమ్యూనిస్టు సమాజానికి బీజరూపమే. చైనాలో కమ్యూనిస్టు సమాజం ఏర్పడేసరికి సమాజానికి మూలంలో వున్న ప్రాథమిక వ్యవస్థ (యూనిట్) కమ్యూనిస్టు కమ్యూన్‌లు అయివుంటుంది. ఒకటీ అరా మినహాయింపులున్నా ప్రతి యూనిట్‌లోనూ కార్మికులు, రైతులు, వర్తకులు, విద్యార్థులు, సైనికులు వుంటారు. విద్యా విషయానికి వచ్చేసరికి ప్రతి యూనిటూ తన ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలల్ని తన కళాశాలనూ నడుపుకొంటుంది. కార్మికుడుగానూ, మేధావిగానూ కూడ ప్రతి ఒక్కరికీ విద్యార్జనకు వలసినంత వ్యవధి వుంటుంది. 'హౌసింగ్ క్వెశ్చన్' (ఇండ్ల సమస్య) అనే పుస్తకంలో ఏంగెల్సు ఇటువంటి పరిస్థితినే వూహించుకొని ఇలా వ్రాశారు :

"ఈ పారిశ్రామిక విప్లవమే మనుష్య శ్రమ యొక్క ఉత్పాదక శక్తిని చాలా ఉన్నతస్థాయికి తీసుకుపోయింది. ప్రజలందరిలోనూ సరియైన పద్ధతిలో శ్రమ విభజన జరిగేటట్లయితే సమాజం లోని సభ్యులందరూ యథేచ్ఛగా అనుభవించే టందుకేగాక దండిగా నిలవ చేయగలంతగా ఉత్పత్తిశక్తి పెరగడానికి అవకాశం మానవ జాతి చరిత్రలో ప్రథమ పర్యాయం కనిపిస్తూంది. చారిత్రకంగా అనుశ్రుతంగా వస్తున్న విజ్ఞానశాస్త్రాలు, కళలు, పరస్పర సంపర్క సాధనాలలో పరిరక్షింప దగినవాటిని పరిరక్షిస్తారు. అంతేకాదు కొద్దిమంది గుత్త అధికారంలోంచి వానిని సమాజం మొత్తం యొక్క అధికారంలో పెడతారు. వానినింకా అభివృద్ధి పరుస్తారు. అలా చేయడానికి మానవజాతి చరిత్రలో ఇప్పుడే ప్రప్రథమంగా అవకాశం లభిస్తూంది."

ఈ లక్ష్యాన్ని సాధించాలంటే శారీరక శ్రమకూ మానసిక శ్రమకూ సంబంధం లేకుండా చేయ కూడదు. మానసిక శ్రమను శారీరక శ్రమతోనూ, విద్యను ఉత్పాదక శ్రమతోనూ జోడించేవిధంగా మన విద్యావిధానం వుండాలి.

విద్యారంగంలో చౌకగా, వేగంగా, మంచి ఎక్కువ ఫలితాలను సాధించలేమని బూర్జువా విద్యావేత్తల భావం, కాని, విద్యారంగంలో మనం ప్రజాసాన్నిహిత్య పంథాను అనుసరించడం వలన చౌకగా, వేగంగా మంచి ఎక్కువ ఫలితాలను సంపాదించగలమని ఈ ఏడాది ప్రారంభం నుంచీ విద్యారంగంలో వచ్చిన బ్రహ్మాండమైన పెరుగుదల స్పష్టపరుస్తూంది. విద్యనూ శ్రమనూ జోడించడం వలన, కార్మికులకూ, రైతులకూ చదువు ఎడ ఆసక్తి కలిగించడం వలన పాఠశాలల స్థాపనలో ప్రజలు సమధికోత్సాహం చూపించేలా చేయగలం. కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం క్రింద ప్రజా సాన్నిహిత్య పంథాను అమలు జరుపుతూ పాఠశాలలను దిగువ సూత్రాల ప్రకారం నడిపించాలి. మొదటిది–ఏకత్వాన్ని వైవిధ్యంతో జతకలపాలి. శిక్షణ వుద్దేశం అన్నిచోట్ల ఒక్కటే. సోషలిస్టు అభిప్రాయాలు గల విద్యావంతులయిన కార్మికుల్ని తయారుచేయడం వాని వుద్దేశం. కానీ స్కూళ్ళను కేంద్రమూ నడపవచ్చు; స్థానిక ప్రభుత్వమూ నిర్వహించవచ్చు; ఫ్యాక్టరీలు, గనులు, పరిశ్రమలు, వ్యవసాయ సహకార సంఘాలు కూడా వాటిని నడపవచ్చు; ఆ స్కూళ్ళ స్వరూపం కూడా భిన్నంగా వుండవచ్చు; అన్ని గంటలూ చదువు చెప్పేవిగానూ వుండవచ్చు; కొంతసేపు పనీ, కొంతసేపు చదువూ చెప్పేవిగా, కాకపోతే తీరుబడి సమయాల్లో చదువుచెప్పేవిగా వుండవచ్చును; జీతాలు పుచ్చుకొనేవి కావచ్చు; పుచ్చుకోనివీ కావచ్చు. ఉత్పత్తి పెరిగినకొద్దీ పనిగంటలు తగ్గుతూ వస్తాయి. ఇప్పుడు తీరుబడి సమయాలలో చదువుకొనేటందుకు ఏర్పడుతున్న పాఠశాలల వంటివే కొంతసేపు పనీ, కొంతసేపు చదువూ నేర్పే పాఠశాలలు. ఉత్పత్తి బాగా ఎక్కువయి సంపద సమీకృతం అయిన కొద్దీ యిప్పుడు జీతాలు వసూలు చేస్తున్న పాఠశాలలు ఉచితంగానే చదువు నేర్పుతాయి.

**రెండోది** : విద్యావ్యాప్తితో పాటు విద్యాస్థాయిని పెంచడం,విద్యాస్థాయి ప్రజానీకానికి అందుబాటులో వుండేలాగు వుండాలి. ప్రజానీకానికి అందుబాటులో వుండేలాగు చేయడంలోనే విద్యాస్థాయి పెరిగేలా చేయాలి. కొంతసేపు పని, కొంతసేపు చదువునేర్పే పాఠశాలలూ, తీరిక సమయం పాఠశాలలూ విద్యను విస్తృతపరుస్తూంటాయి. రెండోవేపున వానితో పాటు పూర్తికాలం పాఠశాలలు కూడా చేరి విద్యాస్థాయిని పెంచుతూంటాయి. కొంతపని, కొంతచదువు నేర్పే పాఠశాలలూ, తీరిక సమయం పాఠశాలలూ విద్యావ్యాప్తికి ప్రధాన సాధనాలుగా వుంటాయి. వాని ఖర్చునవే తెచ్చుకోగలవు. “సామర్థ్యం వున్న ప్రతిఒక్కరు బోధించాలి” అనే నియమానుసారం ఆ పాఠశాలలకు స్థానికంగానే పంతుళ్ళు దొరుకుతారు. ప్రభుత్వ సహాయంతో వారు క్రమంగా పాఠ్యవిషయాలను ఎక్కువ చేసుకోవచ్చు. పరికరాలు సంపాదించుకోవచ్చు. బోధకుల్ని తెచ్చు కోవచ్చు. వృత్తి విద్యాతరగతులు లేని పాఠశాలలో వానిని ప్రారంభించవచ్చు. ప్రధాన – విద్యా తరగతులు లేనిచోట్ల వానిని తెచ్చుకోవచ్చు. ఆ విధంగా రెండు విధాలయిన పాఠశాలలూ తమ లోపాల్ని భర్తీ చేసుకోవచ్చును. సిద్ధాంతాన్నీ, ఆచరణనూ జోడించాలనే సూత్రాన్ని చాలా బాగా కార్యరూపంలో పెట్టవచ్చు.

**మూడోది** : వికేంద్రీకరణతో పాటు సమగ్ర ప్రణాళికా రచనను జోడించడం అవసరం. కేంద్ర ప్రభుత్వ శాఖల్నీ, స్థానిక పరిపాలనా యంత్రాన్నీ, ప్రజల్నీ చురుకుగా కదిలేటట్లు చేసి, చౌకగా, వేగంగా, ఎక్కువగా మంచి ఫలితాలు విద్యారంగంలో లభించేటట్లు చెయ్యాలి. విద్యాప్రణాళికను తయారు చేసేటప్పుడు కేంద్ర, స్థానిక అధికారులు పార్టీ కమిటీల సలహా సహాయాల్ని తీసుకోవాలి. అప్పుడే అవి విద్యాభివృద్ధి నతి వేగంగా తీసుకురాగలవు. ఆ అభివృద్ధి ఉత్పత్తికి ఆటంకం కాకుండా తోడ్పడేటట్లు చేయగలవు.

**నాలుగోది** : స్కూళ్ళలో రాజకీయ, పరిపాలన, విద్యాబోధన, పరిశోధన కార్యక్రమాలలో ప్రజా సాన్నిహిత్య పంథాను అనుసరించాలి. ఆ కార్యక్రమాలన్నింటా కూడ పార్టీ ఆధ్వర్యం క్రింద ఎవరి అభిప్రాయాలను వారు నిశ్శంకంగా ప్రకటించేటట్లు, పెద్ద అక్షరాలతో వ్రాసి నలుగురూ చూసేటందుకు బహిరంగ ప్రదేశాలలో వ్రేలాడ గట్టేటట్లు, ‘మూడు సమ్మేళన పద్ధతుల’ నను సరించేటట్లు చేయాలి. పాతకాలపు నాయకత్వానికి కార్యకర్తలకు మధ్య, ఉపాధ్యాయులకు విద్యార్థులకు మధ్య వున్న అసందర్భపు సంబంధాలను తొలగించి ప్రజాతంత్రయుతమైన సమానత్వ సంబంధాలను స్థాపించాలి. ఈ విధానాల నవలంబించిన చోట మంచి ఫలితాలు కలిగాయనేది అనుభవం వలన తెలుస్తూంది.

## వేల సంవత్సరాల అలవాట్లతో ఘర్షణ

విద్యను శ్రమతో జోడించడానికి ముందు దీర్ఘకాలం కృషి చేయవలసి వుంటుంది. ఎందుకంటే, వేలకొలది సంవత్సరాలు విద్యారంగంలో పాదుకొని వున్న అలవాట్లకూ, ఆచారాలకూ ఇది విరుద్ధం. శారీరక శ్రమనుంచి మానసిక శ్రమను విడబరచ డానికే వేల సంవత్సరాలుగా విద్యారంగంలో పని జరుగుతూంది. చరిత్ర క్రమంలో వచ్చిన దోపిడీ వర్గాలన్నీ రెండు వేల సంవత్సరాలకు పూర్వం వున్న కన్ఫ్యూషియస్ విద్యను ఉత్పాదక శ్రమతో జోడించరాదని ఖండితంగా ఎదుర్కొన్నాడు. ఫాన్ చి అనే ఆయన ‘పశుపాలనను నేర్పమ’ని అన్నప్పుడు కన్ఫ్యూషియస్ ఆయనను ‘తక్కువ వాడు’ అని నిందించాడు. “మనస్సులతో పనిచేసే వారు ఇతరుల్ని పాలించుతారు; శరీర బలంతో పనిచేసేవారు ఇతరులచే పాలించబడతారు; తమని పాలించే వారిని పాలితులు భరిస్తారు. పాలితులచే పాలకులు భరించబడతారు. ఇది సర్వజనులూ సమ్మతించే విషయం” – అంటూ హ్స్యూసింగ్ అనే ఆయనను మెన్షియస్ వ్యతిరేకించాడు. ఈ విషయంలో బూర్జువా పండితులు కన్ఫ్యూషియస్‌నూ, మెన్షియస్‌నూ బలపరుస్తారు. మొదట విద్య ఉత్పాదక శ్రమతో కలిసే వుండేది. తర్వాత వర్గసమాజంలో అవి విడిపోయినాయి; మళ్ళీ ఇప్పుడు జోడించబడాలి.

విద్యనూ, ఉత్పాదక శ్రమనూ జోడించాలనే అభిప్రాయాన్ని మొట్టమొదట ముందుకు తెచ్చినది 18వ శతాబ్దపు కాల్పనిక సోషలిస్టులయిన ఫౌరియరూ, ఓవెరూను. మార్క్సు, ఏంగెల్సు, లెనిన్లు ఈ అభిప్రాయాన్ని సమర్థించారు. పిల్లలకు రోజంతా చదువుచెప్పే

పాఠశాలలకన్న కొంతసేపు చదువు, కొంతసేపు పనీ నేర్పే పాఠశాలలు బాగా వుపయోగపడతాయని మార్పు "కాపిటల్" ఒకటవ సంపుటంలో వ్రాశాడు. "తాత్కాలిక కేంద్ర కౌన్సిలు ప్రతినిధులకు కొన్ని సూచనలు" – అనే దాంట్లో ఆయన సలహా యిది :"సముచితమయిన సామాజిక వ్యవస్థలో బాలబాలికలు తొమ్మిదవ ఏట నుంచి ఉత్పత్తిశ్రమలో పాల్గొనాలి."

తొమ్మిది – పన్నెండేళ్ళ మధ్య వయస్సు గలవారు రోజుకు రెండు గంటలు, పదమూడు – పదిహేను సంవత్సరాలవారు రోజుకు నాలుగు గంటలు, పదహారు, పదిహేడేళ్ళవాళ్ళు ఆరు గంటలు పనిచెయ్యాలని ఆయన అభిప్రాయం.

"ప్రతిఫలాన్ని తెచ్చే ఉత్పాదక శ్రమ, మానసికమైన విద్య, వ్యాయామము, వృత్తిపనిలో శిక్షణ కలిసినప్పుడు శ్రామికవర్గం ఉన్నత, మధ్య తరగతుల ప్రజలకన్న ఉత్తమస్థాయికి పెరుగుతారు" – అని ఆయన ఖచ్చితమైన విశ్వాసం.

"శ్రామికవర్గం అధికారానికి వచ్చి తీరుతుంది. అలా వచ్చినప్పుడు శ్రామికవర్గ పాఠశాలలో సాంకేతిక విద్యకు (సిద్ధాంత రూపంలోనూ, ఆచరణాత్మకంగానూ కూడ) తగిన స్థానం లభిస్తుంది." – అని మార్క్సు ఒకచోట చెప్పాడు. (కాపిటల్ సం.1) శ్రామికవర్గమూ, కమ్యూనిస్టు పార్టీ అధికారంలో వున్న సోషలిస్టు దేశంలో మాత్రమే విద్యను ఉత్పాదకశ్రమతో జోడించాలనే సూత్రాన్ని అమలు జరుపుతారు. విప్లవంలోనూ, నిర్మాణం లోనూ ఆ సూత్రం అక్కడే ప్రముఖ పాత్ర వహిస్తుంది. మార్క్సు చెప్పిన భవిష్యకథనం మన దేశంలో నిరూపించబడుతూంది.

పై సూత్రాన్ని అమలుజరపడం అంటే వేలకొద్దీ సంవత్సర అలవాట్లతో ఘర్షణపడటం అన్నమాట. కమ్యూనిస్టుల పద్ధతిలో ఆ పూజా విగ్రహాల్ని తల్లక్రిందులు చేయాలి. పిడివాదాన్ని పాతిపెట్టాలి. సాహసోపేతంగా ఆలోచించాలి; మాట్లాడాలి; పనిచెయ్యాలి. మార్క్సిజం బోధించే విశ్వమానవ సత్యాలను మన దేశంలోని ప్రత్యేక పరిస్థితులకు సమన్వయించాలి. అప్పుడుగానీ మనం విజయం పొందలేము. ఈ వేళ మన విద్యారంగంలో పాతబడిపోయినవానిని లాగి వేసి, కొత్తవానిని ప్రతిష్ఠించేటందుకు పూనుకొంటున్నాం. బూర్జువా భావాలనూ, పిడివాద అభిప్రాయాలనూ విచ్ఛిన్నం చేస్తున్నాం. మన దేశానికి సరిపడే విధంగా మార్క్సిస్టు విద్యాసూత్రాలను, విధానాలను, పద్ధతులను, పాఠ్యక్రమాన్ని, స్కూళ్ళ నిర్వహణ పద్ధతుల్ని ఏర్పరచుకొంటున్నాము. ఈ విద్యా విషయక విప్లవానికి గట్టి ఆర్థిక పునాదులున్నాయి. ఆర్థిక పునాదికి ఉపరితల నిర్మాణం సరిపడేదిగా వుండాలని మార్క్సిస్టు చారిత్రక భౌతికవాదం చెప్తూంది. రాజ్యాంగ వ్యవస్థ అనేది ఉపరితల నిర్మాణం. అది దేశ ఆర్థిక జీవితం యొక్క నమూనా. విద్య అనేది సిద్ధాంత భాగంలోనిది. అదీ ఉపరితల నిర్మాణమే. అది రాజకీయాలకు ఉపకరిస్తుంది. వర్గసమాజం కొన్ని వేల సంవత్సరాలుగా కొన సాగింది. ఆ సమాజంలో బానిస యజమానుల, భూస్వాముల, పెట్టుబడిదారుల స్వత్వాధికారం ఆర్థిక పునాదిగా వుంటూ వచ్చింది. ఈ స్వత్వాధికారాలకు అనుగుణంగా బానిస యజమానుల, భూస్వాముల, పెట్టుబడిదారుల నియంతృత్వరూపాలలో రాజ్యాంగ వ్యవస్థలు కొనసాగాయి. ఈ నియంతృత్వాలకు తోడ్పడే విద్యావిధానాలు బానిస యజమానుల విద్య, భూస్వాముల విద్య, పెట్టుబడిదారుల విద్యగానే వుంటాయి. వీనిలో ఒకదానికీ వేరొకదానికీ తేడా వుంది. అయినా వీటన్నింటా ఒక సమాన లక్షణం వుంది. అన్నింటా కూడా విద్య – ఉత్పాదక శ్రమ, మానసిక శ్రమ – శారీరకశ్రమ ఒకదానికొకటి సంబంధం లేకుండా వుంటాయి. శారీరక శ్రమనూ, శారీరక శ్రమజీవుల్ని వీటన్నింటా నిరసిస్తారు. బూర్జువావర్గంతో సహా దోపిడీ వర్గాలన్నీ శారీరక– మానసిక శ్రమల పృథగ్వ్యవస్థనే కోరుతాయి.

సోషలిస్టు స్వత్వాధికారం మన సమాజం యొక్క ఆర్థిక పునాది. శ్రామికవర్గ నియంతృత్వం సోషలిస్టు స్వత్వాధికారానికి అనుగుణమైన రాజ్యాంగవ్యవస్థ. మన విద్యావిధానం శ్రామికవర్గ నియంతృత్వాన్ని ఉపచరిస్తుంది. అందుచేత వేల సంవత్సరాల ఆచారాన్ని దిగతొక్కి శారీరక, మానసిక శ్రమల మధ్య అంతరాన్ని తొలగించేటందుకై విద్యనూ, ఉత్పాదక శ్రమనూ జోడించాలనే సూత్రాన్ని అమలు జరపాలి; దీనితో చరిత్రలో మిగిలిపోయివున్న దోపిడీ విధానావశేషాలన్నీ నిర్మూలించబడిపోతాయి. మానవజాతి కమ్యూనిస్టు సమాజంలో అడుగుపెడుతుంది.

విద్యను ఉత్పాదకశ్రమతో జోడించడం శ్రామికవర్గానికీ, శ్రామిక ప్రజలకూ ప్రయోజనకరం. ప్రజావాంఛల కనుగుణమైన యీ సిద్ధాంతం తప్పకుండా విజయం పొందుతుంది. శారీరక, మానసిక శ్రమలను వేర్వేరుగా వుంచడం అనేది వేలకొలది సంవత్సరాల మంచి వస్తున్న ఆచారమే గాని, అది సోషలిస్టు ఆర్థిక పునాదికి అనుగుణ మైనదికాదు. ప్రజల అవసరాలకనుగుణమైనదీ కాదు. అందుచేత ప్రజలు ఏదో ఒకరోజున దానిని నిరాకరిస్తారు. రాజకీయాలమీద మనకు పెత్తనం వుంది. కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం వుంది. దీని సహాయంతో విద్యారంగంలోని కార్యకర్తలందర్నీ సమీకరిస్తాం. బూర్జువా విద్యావిధానాన్ని ఎదుర్కొంటాం. పార్టీ విద్యావిధానాన్ని అమలు జరిపిస్తాం. ఈ విధంగా సాంస్కృతిక విప్లవాన్ని కొనసాగింపజేసి అరవై కోట్ల మందీ ఉత్పత్తి చేయగలిగేటట్లూ, చదువుకొనేటట్లూ చేస్తాం. కార్మికులూ, మేధావులూ కూడా అయిన నూతన మానవుల్ని ఆవిష్కరింపజేస్తాం.

oooo